## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చం

- రేవంత్ బ్రాండ్ ఏందో వచ్చే ఎన్నికల్లో తెలుస్తుంది
- పార్టీ జాతీయాధ్యక్షుడి రేసులో లేను: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్‌ను కూల్చే ఆలోచన తమకు లేదని, రేవంత్‌రెడ్డికి ప్రజలు ఐదేండ్లు అధికారం ఇచ్చారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓడిపోవడం ఖాయమని చెప్పారు. యంగ్ ఇండియా తన బ్రాండ్ అని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయన బ్రాండ్ ఏంటో చూద్దామని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అదనపు పథకాల కారణంగా కేంద్రానికి భారీగా ఖర్చు పెరిగిందని, అందుకే అప్పులు తెచ్చుకుంటున్నామని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ భూముల విషయంలో తాను షేర్ చేసిన వీడియోలపై కేసు పెట్టుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 17న వక్ఫ్ బోర్డుపై వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు.

### కర్ణాటకలో మైనర్ ఇరిగేషన్ సందర్శనకు రండి

**రైతు కమిషన్‌ను ఆహ్వానించిన ఆ రాష్ట్ర మంత్రి**

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): తమ రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను సందర్శించేందుకు రావాలని కర్ణాటక మైనర్ ఇరిగేషన్ మంత్రి బోసురాజు తెలంగాణ రైతు కమిషన్‌ను ఆహ్వానించారు. మంగళవారం బేగంపేట టూరిజం ప్లాజాలో మంత్రితో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానీరెడ్డి భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాలకు చెందిన మైనర్, మేజర్ ఇరిగేషన్‌లపై వీరు చర్చించారు. ఒక నివేదికను తయారు చేసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఇచ్చినట్టు కోదండరెడ్డి తెలిపారు. స్పందించిన బోసురాజు తాను త్వరలో ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి ఈ అంశంపై చర్చిస్తానని పేర్కొన్నారు.

# ధరణికి కాపీలా భూభారతి!

- పేరే మార్పు.. అంతా సేమ్ టు సేమ్
- కాంగ్రెస్ సర్కారు తెచ్చిన భూభారతికి ధరణి పోర్టల్ మార్గదర్శకాలు
- ధరణిలోని అంశాలే కాపీ పేస్ట్
- 33 మాడ్యూల్స్‌ను ఆరుకు తగ్గించినట్టు ప్రభుత్వ పెద్దల గొప్పలు
- ఆ ఆరు మాడ్యూల్స్‌లోనే 33 మాడ్యూల్స్‌లోని అంశాల జోడింపు
- పాత విధానంలోనే రిజిస్ట్రేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు కొత్తగా తీసుకొచ్చిన భూభారతి చట్టం 'పాత సీసాలో కొత్త సారా..' లాగానే ఉన్నది. రైతుల భూముల పరిరక్షణే లక్ష్యంగా బీఆర్‌ఎస్ సర్కారు తీసుకొచ్చిన ధరణిని తిట్టిపోసిన కాంగ్రెస్‌కు, ఇప్పుడు ఆ ధరణి మార్గదర్శకాలే దిక్కయ్యాయి. నాడు ధరణిలో పొందుపరిచిన అంశాలనే భూభారతిలో యథాతథంగా ఎత్తిపోసింది. 33 మాడ్యూల్స్‌ను ఆరుకు తగ్గించామంటూ గొప్పగా ప్రకటించింది. ఇందులోనూ మాయ చేసింది. ప్రస్తుతం ఉన్న 33 మాడ్యూల్స్‌లోని వివిధ అంశాలన్నింటిని కలిపేసి ఆరు మాడ్యూల్స్‌లో పొందుపరిచింది. అన్నీ కలిపేసి మాడ్యూల్స్ తగ్గించామంటూ ప్రకటించేసింది. ఇందులో ఒకటి రెండు మినహా కాంగ్రెస్ సర్కారు కొత్తగా చేసిందేమీ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భూభారతి అమలుకు సంబంధించి రెవెన్యూ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి మాట్లాడుతూ.. 'ధరణి పేరు మాత్రమే మారింది. అంతా సేమ్ టు సేమ్' అని కీలక వ్యాఖ్యలు చేశారు.

**కొత్తదనం లేని భూభారతి**

కాంగ్రెస్ సర్కారు ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చిన భూభారతిలో కొత్తదనం కరువైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకటి రెండు మార్పులు తప్ప పూర్తిగా ధరణిని దించేశారనే అభిప్రాయాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా కొన్ని అంశాలు ఇప్పట్లో అమలు చేసే అవకాశం లేకపోయినప్పటికీ ఇందులో పొందుపరిచి అమలు చేస్తున్నట్టుగా చెప్పుకోవడం గమనార్హం. అందులోని కొన్ని అంశాలను పరిశీలిస్తే...

- కేసీఆర్ సర్కారు అమల్లోకి తీసుకొచ్చిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని భూభారతిలోనూ అమలు చేస్తున్నారు.
- రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే మ్యుటేషన్ కూడా పూర్తవుతుంది. ధరణిలోనూ ఇదే విధానం అమల్లో ఉండేది.
- ఫౌతీ(వారసత్వ) భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మ్యుటేషన్‌కు 30 రోజుల విచారణ గడువు విధించారు. అయితే ధరణిలో గడువుకు బదులుగా రిజిస్ట్రేషన్ సమయంలోనే కుటుంబ సభ్యుల ఆమోద పత్రం తీసుకునేవారు.
- భూభారతి చట్టం వ్యవసాయ, వ్యవసాయేతర, ఆబాదీ భూములకు వర్తిస్తుంది. ధరణిలో కూడా ఇదే విధంగా ఉండేది. కానీ, హైకోర్టు ఆదేశాలతో వ్యవసాయేతర భూముల సేవల్ని నిలిపేశారు. ఇప్పుడు భూభారతిలోనూ వ్యవసాయ భూముల సేవలే అందుతున్నాయి. వ్యవసాయేతర భూములపై స్పష్టత లేదు.
- భూములకు భూధార్ పేరుతో నెంబర్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇది ఎప్పటి నుంచి అమలు చేస్తారనే విషయాన్ని వెల్లడించలేదు.
- భూభారతి ప్రకారం యాజమాన్య హక్కుల నిర్ధారణ కోసం సివిల్ కోర్టును ఆశ్రయించాలి. గతంలో ధరణిలోనూ ఇదే నిబంధన ఉండేది.
- భూభారతి ప్రకారం భూ సమస్యలపై అప్పీలేట్ అథారిటీని ఏర్పాటు చేశారు. ఎంఆర్వో, ఆర్డీవో, కలెక్టర్లకు పరిష్కార బాధ్యతలను అప్పగించారు. గతంలో ధరణిలో కలెక్టర్‌కు మాత్రమే ఈ అధికారం ఉండేది.
- ఇక పాత భూసమస్యల పరిష్కారానికి ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని సర్కారు ప్రకటించింది. కానీ, ఎప్పటి నుంచి వీటిని ప్రారంభిస్తారనేది వెల్లడించలేదు. ధరణిలోనూ ట్రిబ్యునల్స్ ఏర్పాటు అంశం పొందుపరిచారు.
- ప్రతి రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి చేశారు. కానీ, సర్వేయర్లను నియమించలేదు. దీంతో సర్వే మ్యాప్‌పై గందరగోళం నెలకొన్నది.

**రైతులపై ఫీజుల మోత**

భూభారతి చట్టం పేరుతో సర్కారు ఫీజుల మోత మోగించనున్నది. మ్యుటేషన్ కోసం ఎకరాకు రూ.2,500 వసూలు చేయనున్నది. కొత్త పాస్ పుస్తకం కోసం రూ.300 చెల్లించాల్సిందే. ఇక కాంగ్రెస్ సర్కారు కొత్తగా తెచ్చిన రికార్డు మార్పులు, ఇతర అప్పీళ్ల కోసం రూ.1,000 ఫీజు సమర్పించుకోవాల్సిందే.

### అమలుకు ఆలస్యమెందుకు?

భూభారతి అంతా సవ్యంగా ఉంటే.. పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, ఎందుకు ఆసల్యం చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. తొలుత నాలుగు మండలాల్లో మాత్రమే అమలు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని సర్కారు ప్రకటించింది. అయితే అప్పటినుంచైనా పూర్తిస్థాయిలో అమలు చేస్తారా, లేదా? అనే సందేహాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. రెండు నెలల పాటు అవగాహన సదస్సులు పెట్టాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. దీంతోపాటు గత డిసెంబర్‌లో సర్కారు అసెంబ్లీలో భూభారతి చట్టం చేసింది. తాజాగా పోర్టల్‌ను ప్రారంభించడంతోపాటు మార్గదర్శకాలు విడుదల చేసింది. అంటే చట్టం చేసిన తర్వాత నాలుగు నెలలు అమలులో ఎందుకు జాప్యం చేసిందనే ప్రశ్న వినిపిస్తున్నది. అదేవిధంగా గ్రామస్థాయిలో రెవెన్యూ సేవలు అందించేందుకు 10,954 మంది గ్రామ పాలన అధికారులను(జీపీవో) నియమిస్తామని సర్కారు ప్రకటించింది. కానీ, వీరి నియామకం పూర్తి కాకుండానే పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నది.

**అమలుకు ఆలస్యమెందుకు?**

అస్తవ్యస్తంగా ఉన్న ధరణిని బంగాళాఖాతంలో కలిపి రైతులకు మేలు చేసేందుకు భూ వివాదాలు లేని తెలంగాణ కోసం భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నట్టు కాంగ్రెస్ సర్కారు గొప్పగా ప్రకటించింది. అయితే సర్కారు పెద్దలు చెప్పే మాటలకు.. చేసే పనులకు పొంతన లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూభారతి అంతా సవ్యంగా ఉంటే.. పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, ఎందుకు ఆసల్యం చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. తొలుత నాలుగు మండలాల్లో మాత్రమే అమలు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని సర్కారు ప్రకటించింది. అయితే అప్పటినుంచైనా పూర్తిస్థాయిలో అమలు చేస్తారా, లేదా? అనే సందేహాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

# ధరణి పోర్టల్ బ్లాక్!

- నిలిచిపోయిన సేవలు
- భూభారతితోపాటు ధరణి కూడా పని చేస్తుందని ప్రభుత్వ ప్రకటన
- ఆ మరుసటి రోజే నిలిచిపోవడంపై అనుమానాలు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్ పనిచేయడంలేదు. మంగళవారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధరణి సేవలు నిలిచిపోయాయి. దీంతో భూ క్రయ, విక్రయాలకు అంతరాయం ఏర్పడింది. నిజానికి, కొత్తగా తీసుకొచ్చిన భూభారతి పోర్టల్ పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చే వరకు ధరణి వెబ్‌సైట్ కూడా పని చేస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇందుకు విరుద్ధంగా ధరణి వెబ్‌సైట్ నిలిచిపోయింది. ధరణి, భూ భారతి పోర్టల్‌లు వేరువేరు అయినప్పటికీ, అర్ధాంతరంగా ధరణి సేవలు బంద్ కావడంపై రెవెన్యూ వర్గాల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధరణి పోర్టల్ నిలిచిపోవడానికి సాంకేతిక కారణాలే కారణమా? లేక రహస్య ఎజెండా ఏమైనా ఉన్నదా? అనే అనుమానాలను పలువురు వ్యక్తంtచేస్తున్నారు. భూభారతి వెనుక ఉన్న పలువురు కీలక వ్యక్తులు కావాలనే ధరణి పోర్టల్‌ను బ్లాక్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. భూభారతి పోర్టల్ ప్రారంభం కావడంతో పలు భూములకు సంబంధించిన 'లెక్కలు' సరి చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ధరణి పోర్టల్ సేవలను నిలిపేసి అందులోని భూ లెక్కలను 'సరి చేస్తున్నట్టుగా' ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భూభారతి పైలట్ ప్రాజెక్టును ముగ్గురు కీలక మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిథ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లాలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటు భూభారతి అమల్లోకి రావడం, అటు ధరణి పోర్టల్ బంద్ కావడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎందుకు పని చేయడం లేదు?**

వ్యవసాయ భూములకు సంబంధించి ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం భూభారతిని అమల్లోకి తీసుకొచ్చింది. ప్రస్తుతానికి భూభారతి కేవలం నాలుగు మండలాల్లో మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్నది. ఈ నేపథ్యంలో వ్యవసాయ భూముల క్రయ, విక్రయాలకు ఎలాంటి ఇబ్బంది రావొద్దనే ఉద్దేశంతో ఆ నాలుగు మండలాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ధరణి సేవలు యథా ప్రకారం కొనసాగుతాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే, ఆ మరుసటి రోజే ధరణి పోర్టల్ నిలిచిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి ప్రకటించిన తర్వాత కూడా ధరణి సేవలు ఎందుకు నిలిచిపోయాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ధరణి పోర్టల్ వేరు. భూభారతి పోర్టల్ వేరు. అలాంటప్పుడు ధరణి పోర్టల్‌కు ఎందుకు అంతరాయం కలిగిందనేది ప్రశ్న. ధరణి పోర్టల్ సేవలు నిలిచిపోవడంపై రెవెన్యూ శాఖ నుంచి ఎటువంటి ప్రకటనా వెలువడలేదు.

### పట్టాలివ్వాలని గుడిసెవాసుల ఆందోళన

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కురవి రోడ్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించేందుకు మంగళవారం రెవెన్యూ,మున్సిపాలిటీ సిబ్బంది పోలీసులు వెళ్లగా ఉద్రిక్తత చోటుచేసుకున్నది. గుడిసెవాసులు అడ్డుకుని పెట్రోల్ బాటిళ్లతో ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే మురళీనాయక్ గుడిసెవాసులకు అండగా ఉండి పట్టాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. –మహబూబాబాద్

## 'స్లాట్ బుకింగ్' రద్దుచేయాలి

- డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన
- పాతపద్ధతే ఉంచాలని డిమాండ్

ఘట్ కేసర్/పోచారం/శంషాబా రూరల్, ఏప్రిల్ 15: రిజిస్ట్రేషన్లలో రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని డాక్యుమెంట్ రైటర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఘట్‌కేసర్, నారపల్లి, శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద మంగళవారం వారు ఆందోళనకు దిగారు. స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానంతో తాము రోడ్డునపడే దుస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఘట్‌కేసర్‌లో ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తంచేశారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు దొరకక దస్తావేజు లేఖరి వృత్తిని ఎంచుకొని ఉపాధి పొందుతున్నామని, స్లాట్‌బుకింగ్‌తో ఉపాధి కోల్పోతున్నామని తెలిపారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం నుంచే దస్తావేజుల తయారీ పనులను నిలిపివేసి ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు రంగ నరేందర్‌గౌడ్, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేశారు.

శంషాబాద్‌లో సబ్‌రిజిస్ట్రార్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

## అంబేద్కర్ వల్లే మహిళలకు విశిష్టాధికారాలు

- గ్రీన్‌పవర్ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం
- మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం
- స్త్రీ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): దేశంలో మహిళలకు విశిష్టాధికారాలు, హక్కులు, రాజకీయాల్లో వాటాకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పునాదులు వేశారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బాల్యవివాహాలు, వరకట్న నిషేధం, మహిళలకు ఓటుహక్కు, విడాకులు, మహిళలకు ఆస్తిలో వాటా వంటి చట్టాలు అంబేద్కర్ హిందూ కోడ్ బిల్లు ద్వారానే ఆచరణలోకి వచ్చాయని గుర్తుచేశారు. హైదరాబాద్ తాజ్ డెక్కన్‌లో మంగళవారం జరిగిన స్త్రీ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో 33శాతం మహిళలకు రిజర్వేషన్లను మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అమలు చేశారని తెలిపారు. దీంతో ఎన్నికలు, పరిపాలనా రంగంలోకి మహిళలు ఎక్కువ సంఖ్యలో రాగలిగారని చెప్పారు. మహిళా సాధికారతే లక్ష్యంగా తమ ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతున్నదని పేర్కొన్నారు. వచ్చే నాలుగేండ్లలో ప్రతి ఏటా 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు అందజేస్తామని చెప్పారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నూతన గ్రీన్‌పవర్ పాలసీలో మహిళలకు భాగస్వామ్యం కల్పించనున్నట్టు వివరించారు. విద్యుత్తు శాఖ, ప్రభుత్వంలోని ఇతర శాఖలు కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి ఒప్పందం చేసుకున్నట్టు వెల్లడించారు.

**పకడ్బందీగా సంక్షేమం, అభివృద్ధి**

రాష్ట్రంలో పకడ్బందీగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రూ.21వేల కోట్లతో రైతు రుణ మాఫీ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లు, 56 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, 8వేల కోట్లతో రాజీవ్ యువవికాసం, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇదంతా ఒక ఎత్తయితే.. ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన పకడ్బందీగా పూర్తిచేశామని పేర్కొన్నారు.

## జానారెడ్డి నాకంటే జూనియర్

- నాలుగేండ్ల తర్వాత పార్టీలో చేరారు
- నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్నా
- పదేండ్లుగా ఒంటరి పోరాటం చేసిన
- కాంగ్రెస్ పార్టీలో నా స్థానం ఏంటి? : టీ జీవన్‌రెడ్డి



జగిత్యాల, ఏప్రిల్ 15: కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడున్న వారిలో వీ హన్మంత రావు ఒక్కరే తనకన్నా సీనియర్ అని, జానారెడ్డి కూడా తన తర్వాత నాలుగేండ్లకు పార్టీలో చేరినట్టు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టీ జీవన్‌రెడ్డి తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశానని, ఇప్పుడు పార్టీలో తన స్థానం, తన సీనియారిటీ ఏంటని ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. 'కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి.. జీవన్‌రెడ్డి అంటే కాంగ్రెస్' అని అంటారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్నానని, ఏమాత్రం తొనకకుండా, కాంప్రమైజ్ కాకుండా పదేండ్లు ఒంటరి పోరాటం చేశానని గుర్తుచేశారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క ఎంత పోరాడారో శాసన మండలిలో ఏకైక సభ్యుడిగా తానూ అంతే పోరాటం చేశానని తెలిపారు. 2014లో బీఆర్‌ఎస్ ప్రభంజనాన్ని తట్టుకుని జగిత్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలువడమే కాకుండా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి మూడు జిల్లాల్లో ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పని చేసి పార్టీ పటిష్టతకు పాటుపడ్డానని గుర్తుచేశారు. 2019లో ఎన్నికై ఇటీవలి మార్చి వరకు ఆరేండ్లు శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా బీఆర్‌ఎస్‌పై పోరాటం చేసినట్టు చెప్పారు. పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతోందని విలేకరులు అడిగిన ప్రశ్నకు 40ఏండ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నా.. ఎందుకు మారుతానని ఎదురు ప్రశ్న వేశారు.

### 'ఎస్టీ వర్గీకరణ చేయాలి'

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): ఎస్టీ తెగలను వర్గీకరణ చేయాలని ఆదివాసీ తుడుందెబ్బ డిమాండ్ చేసింది. ఈనెల 17న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో ఎస్టీ ఉపకులాల వర్గీకరణ చేయాలనే డిమాండ్‌తో సన్నాహక సభను నిర్వహించనున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో తుడుందెబ్బ ప్రతినిధులు పేర్కొన్నారు. 'హలో ఆదివాసీ–చలో ఇల్లందు' అనే నినాదంతో ఇప్పటికే పలుచోట్ల కరపత్రాలను ఆవిష్కరించినట్టు తెలిపారు. ఈ సభకు పెద్దఎత్తున ఆదివాసీలు తరలిరావాలని వారు కోరారు.

### ముందస్తు బెయిల్ ఇవ్వండి

**ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు**

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న ప్రభాకర్ రావు తనకు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. అమెరికాలో ఉన్న ప్రభాకర్‌రావు భారత్ వచ్చిన వెంటనే దర్యాప్తు అధికారులకు సహకరిస్తానని తెలిపారు. ఈ మేరకు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జే శ్రీనివాస రావు విచారణ చేపట్టారు.

# సీఎల్పీకి.. ఆ ముగ్గురు డుమ్మా!

మొదటిపేజీ తరువాయి...

ఎవరికి తోచినట్టు వారు స్పందిస్తూ వచ్చారు. కొందరు సామాజికవర్గాల వారీగా విడిపోయి లేఖాస్త్రాలు సంధించగా.. మరి కొందరు మీడియా ముందుకో.. ప్రజాక్షేత్రంలోకో వెళ్లి నోటికి పని చెప్పినట్టు కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. ఇటువంటి చర్యలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని, తక్షణమే ఫుల్‌స్టాప్ పెట్టాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆ పార్టీ ఢిల్లీ దూత మీనాక్షి నటరాజన్‌ను ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకే సీఎం రేవంత్‌రెడ్డి సీఎల్పీ భేటీ ఏర్పాటు చేశారని చెప్తున్నారు.

**అందుకే సీఎం రావొద్దన్నారా?..**

తనకు మంత్రి పదవి రాకుండా జానారెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రచ్చచేయగా.. పదేళ్లు పార్టీని కాపాడుకున్న తమను కాదని.. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు ఇస్తారా అని ప్రేమ్‌సాగర్ రావు పరోక్షంగా ప్రభుత్వానికే వార్నింగ్ ఇచ్చారు. ఇక గడ్డం వివేక్.. తాను బీజేపీలో ఉంటే కేంద్ర మంత్రిని అయ్యే వాడినని కౌంటర్ ఎటాక్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలపై సీరియస్ అయిన అధిష్ఠానం.. సీఎల్పీ పెట్టి మాస్ వార్నింగ్ ఆవ్వాలని ఆదేశించటంతో సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వివాదాస్పద ఎమ్మెల్యేలను ఈ భేటీకి రావొద్దని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

**బ్లాక్‌మెయిల్ చేస్తామంటే భయపడదు..**

ఇక సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని, పార్టీని బ్లాక్‌మెయిల్ చేస్తామంటే కుదరదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను హెచ్చరించినట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణ, పదవుల పంపకాలలో అధిష్ఠానం నిర్ణయమే అంతిమం అని, అడ్డగోలుగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించినట్టు తెలిసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా హైదరాబాద్‌కే పరిమితం అవుతున్నారని, ప్రభుత్వంపై నెగెటివ్ ప్రచారం జరుగుతుంటే.. ఎమ్మెల్యేలు స్పందించటం లేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది.

**ముఖం చాటేసిన ఫిరాయింపుదారులు..**

బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గోడ దూకిన 10 మంది ఎమ్మెల్యేలలో ఇద్దరు మినహా మిగిలిన వారంతా ఈసారి కూడా సీఎల్పీ భేటీకి ముఖం చాటేశారు. భద్రాచలం ఎమ్మెల్యేల తెల్లంవెంకట్రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాత్రమే వచ్చినట్టు తెలిసింది.

**ఫిరాయింపుదార్లకు మినహాయింపు..**

పార్టీ ఎమ్మెల్యేలు తమ నెల జీతం నుంచి రూ.25 వేలు పార్టీ ఫండ్ కోసం చందా ఇవ్వాలని సీఎల్పీ నిర్ణయించింది. అయితే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గోడదూకిన ఫిరాయింపుదారులకు ఈ చందాల నుంచి మినహాయింపు ఇచ్చినట్టు తెలిసింది. సుప్రీంకోర్టులో వారి కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో ఫిరాయింపుదారులు పార్టీకి ఇచ్చిన చందాలను కోర్టు ఆధారంగా స్వీకరించే అవకాశం ఉన్నది.

**సీఎంకు తప్పిన ప్రమాదం**

నోవాటెల్ హోటల్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి ప్రమాదం తప్పింది. సీఎల్పీ భేటీకి వచ్చిన ఆయన లిఫ్ట్‌లో వెళ్తుండగా.. సాంకేతిక లోపంతో అది కిందకుదిగింది. ఎనిమిది మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో ఓవర్ వెయిట్ కారణంగా స్వల్పంగా కిందకు కుంగిపోయింది. దీంతో మరో లిఫ్ట్‌లో సీఎం రేవంత్‌ను పంపించారు. ఇది సీఎం సెక్యూరిటీ అధికారుల వైఫల్యమేనని విమర్శలు వస్తున్నాయి.

## వడదెబ్బ మృతులకు రూ.4లక్షలు

**పరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు**

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు కారణంగా వడదెబ్బతో మృతి చెందిన వారికి ఎక్స్‌గ్రేషియాను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వడదెబ్బతో ఎవరైనా మృతి చెందితే నిరుడు రూ.50వేలు ఎక్స్‌గ్రేషియా అందించగా, ఆ మొత్తాన్ని రూ.4లక్షలకు పెంచుతున్నట్టు ఉత్తర్వుల్లో ప్రభుత్వం వెల్లడించింది.

### వడదెబ్బతో నలుగురు మృతి

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 15 : వడదెబ్బతో మంగళవారం రాష్ట్రంలో నలుగురు మరణించారు. మహబూబాబాద్ జిల్లాలోని గార్ల పంచాయతీ పరిధిలోని జీవంచిపల్లికి చెందిన సుశీల (62), కొత్తగూడ మండలం వేలుబెల్లిలో బాసాని మల్లమ్మ(65) మరణించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లిలో వడ్లూరి మల్లయ్య (59), కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలం రాఘుపూర్‌కు చెందిన సోయం హన్మంతు (27) మృతిచెందారు.

### కొడుకును బావిలో తోసి తల్లి ఆత్మహత్య

చిలుకూరు, ఏప్రిల్ 15 : అనారోగ్యంతో ఉన్న ఓ తల్లి దివ్యాంగుడైన కొడుకును బావిలోకి తోసి తానూ ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం రామచంద్రానగర్ (కొత్త కొండాపురం) గ్రామానికి చెందిన బుడిగెం వీరమ్మ(65), భిక్షమయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. కొన్నేళ్ల కిందటే భిక్షమయ్య చనిపోగా.. రెండో కుమారుడు వీరబాబు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. మొదటి కుమారుడు వెంకన్న అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. మూడో కుమారుడు నాగేశ్వరరావు దివ్యాంగుడు (43). వీరిని తల్లి వీరమ్మనే అన్నీ తానై బాగోగులు చూసుకుంటున్నారు. దీంతో రంది పెట్టుకున్న వీరమ్మ సోమవారం రాత్రి గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు నాగేశ్వరరావును తీసుకుని వెళ్లి కుమారుడిని బావిలోకి తోసి, తానూ దూకి ఆత్మహత్య చేసుకుంది.

## ఆర్బీఐ నుంచి 1,000 కోట్ల రుణం

- ఈనెల 8న రూ.2,000 కోట్లు
- తొలి త్రైమాసికానికి 14 వేల కోట్లకు ఆర్బీ ఐకి రేవంత్ సర్కారు ఇండెంట్

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): ఇప్పటికే రికార్డుస్థాయిలో అప్పులు చేసిన రేవంత్‌రెడ్డి సర్కారు.. మరింత రుణ సమీకరణ చేస్తున్నది. రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నుంచి మరో రూ.1,000 కోట్ల రుణం తీసుకున్నది. మంగళవారం నిర్వహించిన ఈ– వేలం ద్వారా ఈ మొత్తం సేకరించినట్టు ఆర్బీఐ వెల్లడించింది. 31 సంవత్సరాల కాలపరిమితికి 6.84శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు తీసుకున్నది. గత మంగళవారం అంటే ఈనెల 8న.. 22 ఏండ్ల కాల పరిమితికి రూ.1000 కోట్లు, 30 ఏండ్ల కాలపరిమితికి మరో రూ.1000 కోట్లను 6.87శాతం వార్షిక వడ్డీతో రుణ సమీకరణ చేసింది.

**రూ.14 వేల కోట్లకు ఇండెంట్**

కొత్త ఆర్థిక సంవత్సరం 2025–26 తొలి త్రైమాసికంలో రూ.14 వేల కోట్ల రుణ సమీకరణ కోసం రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ)కు రేవంత్ సర్కారు ప్రతిపాదనలు పంపింది. ఏప్రిల్‌లో రూ.4000 కోట్లు, మే, జూన్ నెలల్లో రూ.5000 కోట్ల చొప్పున రుణ సమీకరణ కోసం ఇండెంట్ పెట్టింది. ఇప్పటికే ఈ వేలం ద్వారా రూ.3 వేల కోట్లు తీసుకున్నది. ఆర్బీఐకి పెట్టిన ఇండెంట్ ప్రకారం.. ఈ నెలలో మరో 1000 కోట్లు తీసుకోనున్నది. అలాగే.. మే 6న రూ.2000 కోట్లు, 20న రూ.2000 కోట్లు, 27న రూ.1000 కోట్లు, జూన్ 3న రూ.2000 కోట్లు, 17న రూ. 2000 కోట్లు, 24న రూ.1000 కోట్లు ఈ వేలం ద్వారా రుణాలు సేకరించేందుకు ఆర్బీఐకి ప్రతిపాదనలు పంపించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.64,539 కోట్లు సమీకరిస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

## 8,090 చలివేంద్రాల ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, మండల కేంద్రాల్లో తమశాఖ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 8,090 చలివేంద్రాలు ఏర్పాటుచేసినట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ (పీఆర్‌ఆర్‌డీ) మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. రద్దీప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. అవసరమున్న ప్రతిచోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మంగళవారం అధికారులను ఆదేశించారు. ఆ నిధులు నీటి అవసరాలకు వాడుకోవాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్లకు రూ.20.19 కోట్లు

- విడతలవారీగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ): బేస్‌మెంట్ పూర్తిచేసుకున్న 2019 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రూ. 20.19 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో 70,122 ఇండ్లు మంజూరు చేయగా, 13,500 ఇండ్ల బేస్‌మెంట్ పూర్తయినట్టు తెలిపారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా 12మంది లబ్ధిదారులకు లాంఛనంగా రూ. లక్ష చొప్పున చెక్కులను అందజేసినట్టు పేర్కొన్నారు. బేస్‌మెంట్ పూర్తయ్యాక రూ.ఒక లక్ష, గోడలకు రూ.1.25 లక్షలు, శ్లాబుకు రూ.1.75 లక్షలు, ఇల్లు పూర్తయ్యాక మిగతా రూ.లక్ష విడుదల చేయనున్నట్టు తెలిపారు. అధికారుల కోసం వేచిచూడకుండా లబ్ధిదారులే తమ నిర్మాణ పురోగతిని ఫొటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా డబ్బులు వారి ఖాతాల్లో జమవుతాయని పేర్కొన్నారు. 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చ.అ.లకు మించకుండా ఇల్లు నిర్మాణం ఉండాలని తెలిపారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడంతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయం ఉండేలా చూసేందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్టు మంత్రి తెలిపారు.